## క్లుప్తంగా

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**తుని రూరల్:** తుని మండలం తేటగుంట సబ్ స్టేషన్ పరిధిలో శనివారం మరమ్మతులు, కొత్తలైన్ ఏర్పాటు పనులు చేయనున్నట్టు జగ్గంపేట ట్రాన్స్‌కో డీఈ వీరభద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో తేటగుంట సబ్‌స్టేషన్ పరిధిలోని రాజులకొత్తూరు, టి.తిమ్మాపురం, టి.వెంకటాపురం, గవరయ్యపేట, ఎర్రకోనేరు, రాజుపేట, రౌతులపూడి మండలం ధార జగన్నాథపురం గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ సరఫరా అంతరాయంలో కలిగే ఇబ్బందులు గమనించి వినియోగదారులు సహకరించాలన్నారు.

### నైరుతి పలకరింపు.. రైతన్న పులకరింపు



ఎస్.అన్నవరం-జగన్నాథగిరి పరిధిలో కురుస్తున్న వర్షం

**తుని రూరల్:** తుని మండలం పరిధిలో శుక్రవారం సాయంత్రం గంటకుపైగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా తుని పట్టణం, ఎస్.అన్నవరం తదితర ప్రాంతాల పరిధిలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ సంవత్సరం తొలకరిలో భారీ వర్షం కురవడం ఇదే ప్రథమం. ఈదురు గాలులతో ఇళ్లు, షెడ్లపై అమర్చిన ఇనుప రేకులు, తాటాకులు ఎగిరిపోయాయినట్లు స్థానికులు తెలిపారు. కొంతసేపు జనజీవనం నిలిచిపోయింది. ఖరీప్ సాగయ్యే భూములకు దుక్కులు చేసుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు తెలిపారు. ఇప్పటికే ఉన్న ఆరుతడి పంటలు, పండ్లతోటలకు ఈ వర్షం మేలు చేస్తుందని అధికారులు తెలిపారు.

### దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



మురారిలో అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూ కట్టిన భక్తులు

**గండేపల్లి:** కోరిన కోర్కెలు తీర్చే భక్తులపాలిట కల్పవల్లిగా పేరొందిన కనకదుర్గ దర్శనానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. మండలంలోని మురారి పొలాల్లో వేపచెట్టు కింద, గాజులు, రవిక, చీర, శారెద వేంచేసియున్న ఈ అమ్మవారి దర్శనార్థం శుక్రవారం కావడంతో మహిళా భక్తులు క్యూ కట్టారు. పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకుని తాంభూలం పంపిణీ చేశారు. వేసవి కాలం, శెలవులు కావడంతో కుటుంబ సమేతంగా పిల్లలతో సహా జిల్లా నలుమూల ప్రాంతాల నుంచి వేసవితాపాన్ని సైతం లెక్కపెట్టక వాహనాలపై తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

### రాష్ట్రంలో ప్రథమ స్థానం



రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిన సవితను అభినందిస్తున్న చాన్సలర్ శేషారెడ్డి

**గండేపల్లి:** ఆదిత్య విద్యాసంస్థలకు చెందిన మండపేట ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్.సవిత ఇంటర్‌లో 992 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్‌లో నిలిచినట్టు ఆదిత్య యూనివర్సిటీ చాన్సలర్ ఎస్.శేషారెడ్డి తెలిపారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అడ్మిషన్ తీసుకున్న సవితను అభినందించారు. ఆదిత్యలో 2025-26 విద్యాసంవత్సరం అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభమైనట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు. విద్యార్థులు తమ తల్లితండ్రులతో వచ్చి ఇంజనీరింగ్ విద్యలో అడ్మిషన్స్ తీసుకుంటున్నట్టు తెలియజేశారు.

### పర్యావరణంతోనే ఆరోగ్యం..



రామచంద్రపురంలో మొక్క నాటుతున్న సాయిగుణశేఖర్

**కిర్లంపూడి:** పర్యావరణ పరిరక్షణతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సర్పంచ్ తుమ్మపల్లి సాయిగుణశేఖర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో మండల పరిధి రామచంద్రపురంలో భాగంగా గ్రామంలో మూడు రోజుల పాటు సుమారు 300 మొక్కలు నాటేందుకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి జనసేన జగ్గంపేట కో-ఆర్డినేటర్ తుమ్మలపల్లి రమేష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ సభ్యుడు బండారు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మూగబోతున్న ఏలేరు..!

- ఏలేరు కాలువలో తగ్గిన నీటి సరాఫరా
- తాగునీటి కోసం మూగజీవాల కటకట
- ఉపాధి కోల్పోతున్న రజకులు



ఏలేరు కాలువలో నీటి కోసం గ్రామస్తుల కష్టాలు

**ఏలేశ్వరం:** వేసవి ఎండలతో ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు అడుగంటడంతో ఏలేరు ప్రధాన కాలువలో గత రెండునెలలుగా నీటి సరఫరా తగ్గుముఖం పట్టింది. దీంతో దిగువ ప్రాంతాల్లోని మూగజీవాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టులో నీటినిల్వలు అడుగంటిన విశాఖ నగరానికి నీటి విడుదల చేస్తూ ప్రధానకాలువకు నీటి సరాఫరా నిలిపివేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఏలేశ్వరం, కిర్లంపూడి, పెద్దాపురం, పిఠాపురం మండలాలకు చెందిన పలుగ్రామాల ప్రజలు సాగునీరు, తాగునీటికి ఏలేరుకాలువపై ఆధారపడతారు. ముఖ్యంగా మూగజీవాలకు తాగునీటికోసం ఏలేరు కాలువే ప్రధాన ఆధారం. కాగా కాలువలో నీటిసరాఫరా నిలిపివేయడంతో తాగునీటి కోసం మూగజీవాలు కటకటలాడుతున్నాయి. ముఖ్యంగా దిగువ గ్రామాల ప్రజలు తాగునీటితో పాటు ఇతర అవసరాలకు కాలువపై ఆధారపడతారు. ప్రస్తుతం నీటిసరాఫరా నిలిచిపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నారు.

**బతుకు భారంగా రజకులు**

ఏలేరు కాలువపై ఆధారపడి జీవించే రజకులు నీటిసరాఫరా లేకపోవడంతో ఉపాధి కోల్పోతున్నారు. వందలాది కుటుంబాల రజకులు కాలువలో బట్టలు ఉతుకుతూ జీవనం సాగిస్తున్నారు. కాలువలో నీటిసరాఫరా లేకపోవడంతో చెలమల నీటిద్వారా బట్టలు ఉతుకుతూ జీవనం సాగిస్తున్నారు. కాలువలో నీటిసరాఫరా లేకపోవడంతో రజకులు చెలమల నీరు సరిపోక కూలీడబ్బులు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

**తాగునీటికి అవస్థలు**

ఏలేరు కాలువలో నీటి సరఫరా నిలిపివేయడంతో దిగువ గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. కాలువలో నీటిచెలమలు అంతంత మాత్రంగా ఉండడంతో తాగునీటికోసం కిటకిటలాడుతున్నారు. ప్రజలతోపాటు మూగజీవాల పరిస్థితి దారుణంగా ఉంది. రోజంతా గడ్డిమేస్తూ సాయంత్రమయ్యే సరికి కాలువలో తాగునీటిపై ఆధారపడతాయి. యజమానులు వీటిని కాలువ నీటిలోనే



కాలువలో చాలీచాలని నీటితో బట్టలు ఉతుకుతున్న రజకులు

శుభ్రం చేస్తారు. అధికారులు కాలువలో నీటి సరఫరా పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ

**తొండంగి:** క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్లయ్యపేటలో గ్రామ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గ్రామంలో పార్టీ కార్యకర్తలు, యువతతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు .పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతీ కార్యకర్తకు ఏ కష్టం వచ్చిన తాను అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ మడదా హేమంత్, గ్రామసర్పంచ్ సింగిరి సింగారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఎల్లయ్యపేటలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

# వెంకటేశ్వర స్వామికి రథం సమర్పణ

**జగ్గంపేట:** జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో పునర్నిర్మాణం జరిగిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి గ్రామానికి చెందిన ఒక భక్తుడు సుమారు రూ.2 లక్షలు విలువైన టేకుతో తయారు చేసిన రథాన్ని సమర్పించారు. గ్రామానికి చెందిన యడ్లపల్లి వారు కార్పెంటరీ వర్కులో ప్రత్యేకతను చాటుకుంటారు.ఆ కుటుంబానికి చెందిన యడ్లపల్లి అప్పారావు, గంగాభవానీల కుమారుడు యడ్లపల్లి రమేష్, నాగదుర్గ కుమారి దంపతులు శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని గ్రామంలో ప్రత్యేక దినాలలో గ్రామసేవకు తీసుకువెళ్లడానికి వీలుగా రథాన్ని స్వయంగా తయారు చేశారు. శుక్రువారం ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారి ఫొటోలతో రథాన్ని పూలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించి ఆలయానికి తీసుకువచ్చి కమిటీకి అందచేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వెంకటేశ్వరస్వామికి తయారు చేసిన రథాన్ని ఆలయానికి తీసుకు వస్తున్న భక్తులు, రమేష్ దంపతులు

### భూదాన భూముల జోలికెళ్లొద్దు



దళితులతో మాట్లాడుతున్న డీటీ ప్రదీప్

**తుని రూరల్:** దళితుల సాగులో ఉన్న భూదాన భూములలో చెట్లు నరకొద్దని, క్రయవిక్రయాలు చేయొద్దని తహసీల్దార్ ప్రసాద్ ఆదేశించారు. తప్పుడి రికార్డులతో తమ సాగులో ఉన్న భూములను ఆక్రమించుకుంటున్నారని ఆరోపిస్తూ దళితులు కొద్దిరోజులుగా ఆందోళన చేస్తున్నారు. దీనిపై శుక్రవారం రెండు వర్గాలతో రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్‌లు వేర్వేరుగా చర్చలు నిర్వహించారు. దళితుల సాగులో ఉన్న ఈ భూములను ఎవరూ విక్రయించరాదని, కొనుగోలు చేసే హక్కు ఎవరికి లేదన్నారు. చట్టాలను ఉల్లఘించిన వారిపై కఠిన చర్యల తప్పవన్నారు. 2014లో ఒక వర్గానికి రెవెన్యూ అధికారులు జారీ చేసిన నోటీసులపై తుది నిర్ణయం వెలువడాల్సి ఉందన్నారు. దళితులకు న్యాయం చేయాలని కోరినట్టు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకుడు కె.జనార్దన్ వారిని కోరారు.

# యోగాతో బహుళ ప్రయోజనాలు



తుని రూరల్ సర్కిల్ ఆఫీస్‌లో యోగా చేస్తున్న సీఐ చెన్నకేశవరావు, సిబ్బంది

**తుని రూరల్:** నిత్యం యోగా చేస్తే శరీరానికి బహుళ ప్రయోజనాలు కలుగుతాయని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు అన్నారు. యోగా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం తుని రూరల్ సర్కిల్ కార్యాలయంలో తన సిబ్బందితో కలసి సీఐ యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక ఉత్సహంతో పాటు శరీరక దారుఢ్యం, ప్రశాంతత, ఒత్తిడిలేని జీవనం పొందవచ్చన్నారు. శరీరంలో అవయవాలు ధృడత్వంతో పని చేస్తాయని ఫలితంగా ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందన్నారు. కాకినాడ సూపరింటెండెంట్ పోలీస్ జి.బిందు మాధవ్ ఆదేశాలతో తుని రూరల్, పట్టణ పోలీసు సిబ్బందితో యోగాభ్యాసనాలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

**శారీరక, మానసికంగా యోగా దోహదం**

**గోకవరం:** శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దోహదపడుతుందని గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్ సుచరిత మార్గరేట్ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా యోగా టీచర్ రమ్య సిబ్బందితో కలిసి యోగాసనాలు వేయించారు. డీఎమ్ మాట్లాడుతూ యోగాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, సిబ్బంది ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతీ రోజు యోగా సాధన చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అడ్డాల అప్పారావు, సిబ్బంది స్వామి, బుజ్జి, పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

### పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన



అల్లిపూడిలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

**కోటనందూరు:** అల్లిపూడి కేజీబీవీలో రూ.1.2 కోట్లతో నిర్మించే అదనపు తరగతి గదుల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే యనమల దివ్య శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కిషోర బాలికల విద్యకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కేజీబీవీల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థినులకు మెరుగైన విద్యనందించాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంకంరెడ్డి రమేష్, పెంటకోట భాస్కర్, గాడి రాజబాబు, పోతల సూరిబాబు, చిరంజీవిరాజు, అంకంరెడ్డి బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

**ఏలేశ్వరం:** పట్టణంలో శుక్రవారం శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాగు వారివీధిలో ఆలయ ధర్మకర్త వాగు సూరిబాబు ఆధ్వర్యంలో నూతనంగా పునర్నార్మించిన ఆలయంలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని పలుప్రాంతాల నుంచి భక్తులు ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. వందలాదిగా భక్తులు స్వామి తీర్థప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### మెరుగైన సేవలు అందించండి

**తుని రూరల్:** సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువనసుందరి సచివాలయ సిబ్బందికి సూచించారు. శుక్రవారం తుని పట్టణంలో బ్యాంకు కాలనీ, గుర్రాలశాల సచివాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అనంతరం అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడిన ఆమె సిబ్బందికి శుభ్రమైన అందించేలా పలు సూచనలు చేశారు. ఆమె వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

### 14 మంది విద్యార్థినులకు మెరిట్ స్కాలర్ షిప్

**తుని రూరల్:** తుని పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 14మంది బాలికలు నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్ షిప్‌లకు ఎంపికైనట్టు హెచ్ఎం గంటా జయంతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున ఐదు సంవత్సరాలు స్కాలర్ షిప్ వస్తుందని ఆమె పేర్కొన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన కె.రమేష్, రాధిక, వరలక్ష్మి, ఎస్.గిరిలను హెచ్ఎం అభినందించారు.

**ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఎంపిక**

**కిర్లంపూడి:** నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు తామరాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదివిన దూళ సత్యరామాంజనేయులు అర్హత పొందాడు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్ షిప్ స్కీమ్ అర్హతకు నిర్వహించిన పరీక్షా ఫలితాలు గురువారం విడుదల అయ్యాయి. ఈ పరీక్షలలో సత్యరామాంజనేయులు 180 మార్కులకు 153 మార్కులు సాధించి కాకినాడ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాడు. పాఠశాల హెచ్ఎం ఎల్.కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక గ్రామ పెద్దలు విద్యార్థిని అభినందించారు.

### రోజంతా ముచ్చెమటలు

**ప్రత్తిపాడు:** తగ్గేదే.. లే అన్నట్టుగా సూరీడు ప్రతాపం చూపిస్తుండటంతో పుడమి అగ్నిగోళంలా మండుతోంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో జనజీవనానికి ఇబ్బందిగా మారుతోంది. రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలు, రాత్రిళ్లు 27 డిగ్రీలకు ఎగబాకుతున్నాయి. శుక్రవారం ప్రత్తిపాడు మండలంలో భానుడి భగభగలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో పలు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. గాలిలో తేమ శాతం భారీగా పడిపోతోంది. ఆరు నుంచి పది కిలోమీటర్ల వేగంతో వీస్తున్న వడగాడ్పులు జనానికి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ఉదయం తొమ్మిది గంటలు దాటితే జనాలు బయటకు రావడానికి జంకుతున్నారు. వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసరమైతేనే బయటకు రావాలని, లేదా నీడపట్టున ఉండాలంటూ వైద్యులు సూచిస్తున్నారు.

### ఈదురు గాలులకు ఇళ్లు ధ్వంసం



చామవరంలో బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు నాగం దొరబాబు

**తుని రూరల్:** మండలంలో శుక్రవారం సాయంత్రం ఆకస్మత్తుగా కురిసిన భారీ ఈదురు గాలుల వానకు రెండు ఇళ్లు ధ్వంసమైనట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ తెలిపారు. చామవరంలో కొబ్బరి చెట్టు కుప్పకూలడంతో వంగలపూడి నాగమ్మకు చెందిన ఇల్లు ధ్వంసమైయ్యింది. వైఎస్సార్ సీపీ నాయకుడు, తాండవ సుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు బాధితురాలిని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. చేపూరులో చెట్టుపడి మరో ఇల్లు ధ్వంసమైయినట్లు డీటీ ప్రదీప్ తెలిపారు.

# కిశోర బాలికలకు ఉజ్వల భవిష్యత్

**తుని రూరల్:** కిశోర వికాస బాలికల విభాగం భవిష్యత్‌ను తీర్చిదిద్దుతుందని స్త్రీ శిశు సంక్షేమ అధికారి కె.శ్రీలత అన్నారు. శుక్రవారం తుని మండలం చేపూరు, తొండంగి మండలం వేమవరం గ్రామాల్లో అంగన్వాడీల ఆధ్వర్యంలో కిషోర బాలికలకు కిషోర వికాసంపై అవగాహన, కౌమార బాలికల సాధికారత, శారీరక వ్యాయామం, ఆటపాటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత మాట్లాడుతూ బాలికలకు 16ఏళ్ల దశలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ వయస్సులో సత్ప్రవర్తనతో మెలిగితే జీవితం చివరివరకు అద్భుతంగా జీవించగలుగుతున్నారన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండ ఉండాలని, ఎటువంటి పరిస్థితులు ఎదురైనప్పటికీ ప్రభుత్వంలో పలు విభాగాలు, స్త్రీ శిశు సంక్షేమశాఖ అండగా పనిచేస్తున్నాయన్నారు. అంగన్వాడీ కేంద్రాలు ద్వారా అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బాలల రక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ రమణమ్మ, చేపూరు సర్పంచ్ కొండ్రు నాగేశ్వరరావు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, కిశోరబాలికలు పాల్గొన్నారు.



కిశోరబాలికలకు బహుమతులు అందిస్తున్న సీడీపీఓ

**శరీర ధృడత్వానికి క్రీడలు దోహదం**

**జగ్గంపేట:** క్రీడలు కేవలం సరదాకోసమే కాదని, ఆరోగ్య పరిరక్షణ, శారీరక ధృడత్వానికి ఎంతో మేలు చేస్తాయని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరక్టర్ విజయకుమారి అన్నారు. జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో జరిగిన కిశోర బాలికలకు నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కిశోరి బాలికల హక్కులు, ఆరోగ్య పరిరక్షణ, బాల్యవివాహాలు దాని వల్ల కలిగే నష్టాలు, చట్ట పరంగా తీసుకునే చర్యలు గురించి వివరించారు. అనంతరం రామవరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సునీత, అంగన్వాడీ సిబ్బంది, కిశోరి బాలికలు, పాల్గొన్నారు.

# పెండ్లికుమారుడు, కుమార్తెలుగా అలంకరణ



ఏలేశ్వరంలో పెండ్లి కుమారుడు, కుమార్తెగా ముస్తాబైన స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న భక్తులు

**ఏలేశ్వరం:** శ్రీ అనంతలక్ష్మీ సమేత శ్రీ సత్యనారాయణస్వామి వారి పాంచాహ్నిక కల్యాణమహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి అమ్మవార్లను పెండ్లికుమారుడు, కుమార్తెగా ముస్తాబు చేశారు. స్థానిక ఏలేరు నది ఒడ్డున వేంచేసియున్న స్వామివారి ఆలయంలో అర్చకుడు పొన్నూరు సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లను ముస్తాబు చేశారు. శనివారం రాత్రి 7 గంటల నుంచి కల్యాణం నిర్వహించనున్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవంలో భాగంగా పారాయాణాలు చేపట్టారు. పరిషత్ మండల కార్యదర్శి కటకం కిరిటీ ఆధ్వర్యంలో మహిళలు పారాయణాలు అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గిరిజా, ఇందిరా, మంగామణి, కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సిందూర్‌లో జగ్గంపేట సైనికుడు

**జగ్గంపేట:** జగ్గంపేటకు చెందిన ఎండీ గౌస్ మొహిద్దీన్ సాహెబ్ బీఎస్ఎఫ్‌లో జవాన్‌గా పనిచేస్తున్నాడు. జమ్మూకశ్మీర్లో ఉగ్రవాదులు ఘాతకం తరువాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న ఆతడు శుక్రవారం జగ్గంపేట వచ్చిన సందర్భంగా సున్ని జామియా మసీదులో ఘనంగా సత్కారం లభించింది. పహల్గామ్‌లో ఉగ్రవాదులు అమాయకులైన భారతీయ పర్యాటకులను హతమార్చడం దాని పర్యవసానంగా భారత్ పాకిస్థాన్‌పై దాడులు నిర్వహించి ఉగ్రవాదులను మట్టుబెట్టిన విషయం విధితమే. ఈ సైనిక చర్యలో జగ్గంపేటకు చెందిన గౌస్ మొహిద్దీన్ కూడా పాల్గొన్నారు. కటుంబ సభ్యులను కలిసేందుకు మొహిద్దీన్ జగ్గంపేట రావడంతో జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షుడు ఎస్.ఎ గఫూర్ ఆధ్వర్యంలో స్థానిక ముస్లిం సోదరులు, జగ్గంపేట సీఐ వై.ఆర్.కె శ్రీనివాస్ స్వాగతం పలికారు. మసీదులో పూలమాలలు, శాలువాలతోను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, మసీదు కమిటీ అధ్యక్షుడు ఆరిఫ్, డాక్టర్ బాషా, ఖాజా, రెహమాన్, మరి కొంతమంది ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.



జవాన్‌ను సత్కరిస్తున్న ముస్లిం సోదరులు

# వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు

**ఏలేశ్వరం:** వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గ్రంథాలయాల్లో నిర్వహించిన శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ శిబిరాల్లో పలువురు ఉపాధ్యాయులు, విద్యావేత్తలు విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణఇచ్చారు. విద్యార్థులకు పలువురు ఉపాధ్యాయులు కథలు, కథనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనంపై శిక్షణనిచ్చారు. ముగింపు కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాబ్జీ, అధ్యాపకుడు వాగు మాధవ చేతుల మీదుగా సుమారు 50 మంది విద్యార్థులు మోమోంటోలు, ప్రసంశపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవులు వృధ కాకుండా విద్యార్థులకు విజ్ఞాన శిబిరాలు ఎంతోగానో ఉపయోగపడ్డాయన్నారు. చెన్నాప్రగడ సత్య గాంధీ, మామిడి రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

**ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు**

**కిర్లంపూడి:** మండలంలోని కిర్లంపూడి, వీరవరం, గెద్దనాపల్లి గ్రంథాలయాల్లో గత ఏప్రియల్ 28 నుంచి జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. వీరవరం గ్రంథాలయంలో 40 రోజులపాటు విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, నీతి కథలు, లెమన్ స్పూన్ వంటి పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు శుక్రవారం స్థానిక పెద్దలు టీఎస్‌వీఎస్ రాందాస్, కె.సత్యన్నారాయణ రాజు, ఉపాధ్యాయులు వెలుగుల భాస్కరరావు, బి.వరహాలబాబు చేతుల మీదుగా సర్టిఫికెట్స్, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పాఠకులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో గ్రంథాలయంలో ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

# నాణ్యమైన ఆహారం అందించాలి

**ప్రత్తిపాడు:** మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం)లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు అన్నారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ తరగతులను ప్రారంభించిన ఎంఈఓ వి. రాజబాబు మాట్లాడుతూ నూతన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. ఎంఈఓ 2 వై.అచ్చిరాజు మాట్లాడుతూ ఎండీఎం నిర్వాహణ ప్రదేశాల వద్ద పరిశుభ్రత పాటించాలని, అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎండీఎం నిర్వాహకుల విధులు, విధానాలు, ఎండీఎం నిర్వాహణ, పరిశుభ్రత, మెనూ తదితర అంశాలపై జిల్లా రిసోర్సు పర్సన్ గుడాల సుందరరావు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏలేశ్వరం ఎంఈఓ 2 వరలక్ష్మి, ఆర్పీలు పి.నాగమణి, ఎస్.సుబ్బలక్ష్మీలతో పాటు ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాలలోని 89 పాఠశాలల మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు హైస్కూల్‌లో ఎండీఎం నిర్వాహకుల శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈఓ వి రాజబాబు.

# అధికారులు విధిగా హాజరు కావడం లేదు

**ఏలేశ్వరం:** ప్రజా సమస్యలు చర్చించే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు విధిగా హాజరుకావాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అసహనం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమావేశానికి బాధ్యతగా అధికారులు రావడం లేదన్నారు. ప్రతి సమావేశానికి రాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అధికారులు రాకపోతే సమస్యల పరిష్కారం ఎలా అవుతుందని అసహనం వ్యక్తం చేశారు. తొలుత ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ రీసర్వే పారదర్శకంగా చేయాలన్నారు. తూర్పు లక్ష్మీపురం, రమణయ్యపేట గ్రామాలకు స్మశానవాటికలకు స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, వైస్ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, సాదే లోవరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

### దుప్పట్లు, ఆహార పొట్లాల పంపిణీ

**ప్రత్తిపాడు:** స్థానిక జాతీయ రహదారిపై గల శ్రీపాదాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద గల శ్రీ శారదా వయోవృద్ధ నిలయంలోని వృద్ధులకు పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను దుప్పట్లు, ఆహార పొట్లాలు అందజేశారు. లండన్‌లో నివసిస్తున్న తన మనమరాలు శుక్రవారం పుట్టినరోజు జరుపుకుంటున్న సందర్భంగా వయో వృద్ధ నిలయంలోని వృద్ధులకు వీటిని అందజేసినట్టు ధరణాలకోట శ్రీను తెలిపారు. కాంగ్రెస్ గ్రామ కమిటి నాయకులు దాసరి సత్తిబాబు, నాగేంద్ర, కందిమళ్ల సామ్యేలు, డి.బ్రహ్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.